క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ పంపిణీ నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. తట్టిఖాన ఫీడర్ కింద ఉన్న వ్యవసాయ బావులకు, బోర్లకు, పరిశ్రమలకు, కోళ్లఫారాలకు, పొల్కంపల్లి ఫీడర్ కింద ఉన్న పొల్కంపల్లి, ఎల్లగూడ గ్రామాలకు, వ్యవసాయ బావులకు, బోర్లకు, కోళ్ల ఫారాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ పంపిణీ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాచారం మండలంలో..

యాచారం: విద్యుత్ లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని యాచారం మండల విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండా, వేపపురి తండాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేయాలంటూ అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ అనితారెడ్డి హయత్‌నగర్ సీఐకి ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ తెలిపిన ప్రకారం వివరాల్లోకి వెళ్తే... మండల పరిధిలోని గౌరెల్లి గ్రామంలోని సర్వేనంబర్ 206లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారన్న సర్పంచ్ తుడుం మల్లేశ్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు గ్రామంలోని ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించగా గ్రామానికి చెందిన ధనుగారి శ్రీనివాస్, శోభా, ధనుగారి ప్రసాద్, పోచగోని వరలక్ష్మీ, గణేష్, కిట్టు అక్రమంగా గ్రామకంఠం పత్రాలు చూపిస్తూ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లు నిర్ధారించారు. దీంతో ఆక్రమణదారులు నాటుకున్న రాతి కడీలను తొలగించడంతో పాటు వారిపై హయత్‌నగర్ సీఐకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే ఎలాంటి వారైనా ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

తుర్కయంజాల్: ఇళ్ల స్థలాల సాధనకై ఫిబ్రవరి 9న ఇందిరాపార్కు దగ్గర జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల పోరాట వేదిక రంగారెడ్డి జిల్లా నాయకులు, మాజీ జెడ్పీటీసీ పగడాల యాదయ్య అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రాగన్నగూడలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి.. సూపరింటెండెంట్ అమరజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుమలత, నాయకులు టి.నర్సింహ, భాస్కర్, వెంకటకృష్ణ, శంకరయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తుకారాం, జెడ్పీటీసీ

యాచారం: ప్రముఖ పర్వతారోహకుడు అంగోత్ తుకారాం.. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా నూతన కలెక్టర్ హరీశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పర్వతారోహణ గురించి కలెక్టర్.. తుకారాంను అడిగి తెలుసుకున్నారు.

జెడ్పీటీసీ కూడా..

కడ్తాల్: జిల్లా కలెక్టర్ హరీశ్‌ను శుక్రవారం కడ్తాల్ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ కలెక్టరేట్‌లో కలిశారు. పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన హజీరాబేగం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.5 లక్షలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హజీరా భర్త సత్తార్‌కు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖలీల్, మహ్మద్ అక్బర్, హనీఫ్, అఫ్సర్, లాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్లాట్ల కేటాయింపు

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారం, అన్నోజిగూడ గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇంటి స్థలాల సర్టిఫికెట్లు అందించడానికి శనివారం మంత్రి సబితారెడ్డి రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఐఐసీ అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌లో ప్లాట్లు కేటాయించనున్నారన్నారు. మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అందరూ సకాలంలో హాజరుకాగలరని ఈసందర్భంగా ఆయన కోరారు.

మైదానం అనుకునేరు!

పై ఫొటో పచ్చని తివాచీ పరిచిన మైదానంలా కనిపిస్తుంది కదూ... కానీ ఆ పచ్చదనం మాటున గరళం దాగి ఉంది. పెద్దంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పస్మాముల రాయన్‌చెరువులో మురుగు నీరు కలుస్తుండటంతో చెరువంతా గుర్రపు డెక్క విస్తరించింది. పైన గుర్రపు డెక్కతో ఆకుపచ్చగా కనిపిస్తున్నా లోపల మురుగు నీరు దాగి ఉంది. చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– హయత్‌నగర్



అర్చకులకు అండగా ఉంటా

ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి



అర్చకులకు విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో పనిచేసే అర్చకులకు ప్రతి సంవత్సరం రూ.60 వేలు తాను వ్యక్తిగతంగా అందించడం జరుగుతుందని ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాదికి సంబంధించిన రూ.60 వేలను ఆలయ అర్చకులకు శుక్రవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలో పనిచేసే అర్చకులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన జీవితాంతం ప్రతి సంవత్సరం రూ.60 వేలు ఆలయ అర్చకులకు అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, స్థానిక నాయకులు చెన్నకిషన్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, బీచ్యానాయక్, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదే

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మంచాల: తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదేనని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని జాపాల గ్రామానికి చెందిన పలువురు మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిందన్నారు. గ్రామాల్లో పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, దళితులకు మూడెకరాలు భూమి ఇవ్వలేదన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో ఆగాపల్లి, జాపాలకు చెందిన కల్పన, కళమ్మ, గీత, కోటమ్మ, స్వరూప, ప్రీతి, మనీలా, సువర్ణ, బకున వీర మల్లప్ప, మల్లేశ్, మహేష్, భిక్షపతి, నరేష్, జంగయ్య, స్వామి, లింగం, కృష్ణ, సత్యం, సిద్దు, శంకర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు చేతాల సంజీవ, మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, నాయకులు సంతోష్, బాలయ్య, అజయ్‌కుమార్, ప్రేమాకర్‌రెడ్డి, దశరథ, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేస్తాం

మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి



బోడకొండలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర శుక్రవారం బోడకొండ గ్రామంలో కొనసాగింది. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కోసం కల్పిస్తామన్నారు. సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వ్యవసాయ పొలంలో వరినాట్లు వేస్తున్న మహిళా రైతులతో ముచ్చటించారు. రంగాపూర్ చౌరస్తాలో సంత్ సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో అర్హులైన వారిందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి బహదూర్, ఎంపీపీ నర్మద, సర్పంచ్ ఆలివేలు, ఉపసర్పంచ్ భద్రీనాథ్ గుప్తా, నాయకులు సుకన్య, సికిందర్‌రెడ్డి, జానీపాష, రవి, కస్నానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నేతలు

ఇబ్రహీంపట్నం: దండుమైలారం గ్రామంలో శుక్రవారం కురుమ కులస్తుల దైవమైన శ్రీ బట్టిపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ యాదగిరిరావు సతీమణి పారిజాత జ్ఞాపకార్థం ఆలయాన్ని నిర్మించారు. వేద పండితులు లక్ష్మణ్‌శర్మ, రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో మండప పూజలు, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంగ్రామ యాత్ర ప్రబంధక్ నిట్టు శ్రీశైలం, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నిట్టు నర్సింహ, రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ జంగయ్య, శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

6నుంచి ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థుల కోసం ఈనెల 6వ తేదీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు ఎంకేఆర్ ఫౌండేషన్ కార్యదర్శి జెర్కొని రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగాలు, గ్రూప్–1, గ్రూప్–4 తోపాటు ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం రెండవ దఫా శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇప్పటికే అధ్యాపకులతో మాట్లాడినట్లు చెప్పారు. అభ్యర్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన అన్నివర్గాల అభ్యర్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. 45 రోజుల పాటు తరగతులు నిర్వహించి 10 గ్రాండ్ టెస్టులతో అభ్యర్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఆర్‌సీ కేంద్రాన్ని తరలించండి: బీజేపీ



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వామికుమార్ తదితరులు

మీర్‌పేట: పేద ప్రజలు శుభకార్యాలు చేసుకునే హుడా కమ్యూనిటీహాల్‌లో డ్రై రిసోర్స్ సెంటర్ (డీఆర్‌సీ) ఏర్పాటు చేయడం సరైంది కాదని, మరోచోటకు మార్చాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ ఉపాధ్యక్షుడు ఓర్సు స్వామికుమార్ శుక్రవారం కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామికుమార్ మాట్లాడుతూ... లెనిన్‌నగర్ ప్రాంతంలోని పేద ప్రజలు చిన్నచిన్న శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా 40 ఏళ్ల క్రితం హుడాకాలనీలో హుడా కమ్యూనిటీహాల్‌ను నిర్మించడం జరిగిందన్నారు. ఇటీవల కమ్యూనిటీహాల్‌లో డీఆర్‌సీ ఏర్పాటు చేయడంతో పాడిచెత్త డంపింగ్ కేంద్రంగా మారిపోయిందని అన్నారు. స్థానిక పేద ప్రజల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్ వారికే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తేగా, త్వరలోనే డీఆర్‌సీ కేంద్రాన్ని మరో చోటకు మారుస్తామని తెలిపినట్లు స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెవ్వ శ్రావణ్‌కుమార్, శ్రీను, మహేష్‌కుమార్, శ్రవణ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించండి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: స్థలం ఉన్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ సభ్యుడు కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్, మండల కార్యదర్శి బుద్దీరపు శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లులేని ప్రతి పేదవాడికి డబుల్ బెడ్‌రూమ్ కట్టిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో ఆ పథకం అమలుకు నోచుకోలేకపోవడం బాధాకరమన్నారు. దీంతో నిరుపేదలు ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుట్టి బాల్‌రాజు, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షుడు రాయకంటి శేఖర్, జీఎంపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం, నాయకులు కుమార్, అంజయ్య, యాదయ్య, అరుణ, యాదమ్మ, అనిత పాల్గొన్నారు.

నగదు బదిలీ చేయండి

తహసీల్దార్లకు గొర్రెల కాపరుల సంఘాల నేతల వినతి



కడ్తాల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: గొర్రెల కాపరులకు గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా నగదు బదిలీ చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు క్యామ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గొరెటి యాదయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కడ్తాల్ తహసీల్దార్ మురళీకృష్ణకు గొర్రెలకాపరుల సహకార సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మొదటి విడుత గొర్రెల పంపిణీలో దళారుల వల్ల పెంపకందారులు తీవ్రంగా నష్టపోయారని... రెండవ విడుత గొర్రెల పంపిణీలో గొర్రెల పంపిణీకి బదులుగా నగదు బదిలీ అమలు చేయాలని కోరారు. మునుగోడు అసెంబ్లీ ఉపఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. గొర్రెలకు బదులు, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు బదిలీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి నెలలు గడిచినా హామీని నిలబెట్టుకోలేదని, లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గొర్రెల పెంపకానికి ఫారెస్ట్ డివిజన్‌లో కొంత మొత్తం భూమిని కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి అంజయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఉప సర్పంచ్ రామకృష్ణ, బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, డైరెక్టర్లు రాంచంద్రయ్య, మహేశ్, రమేశ్, రాజేశ్, యాదయ్య, రమేశ్, లక్ష్మీనారాయణ, నాగరాజు, మహేశ్, శ్రీకాంత్, శివ, శ్రీశైలం ఉన్నారు.

వినతిపత్రం అందజేత

తలకొండపల్లి: మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు గొర్లకు బదులుగా నగదు అందజేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షుడు చిన్న మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం కమిటీ సభ్యులతో కలిసి తహసీల్దార్‌కు కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కోశాధికారి తిరుపతి, మహేందర్, కృష్ణయ్య, జీఎంపీఎస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత పంపిణీ చేయండి

యాచారం: ప్రభుత్వం గొర్రెల కాపారులకు రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలని శుక్రవారం గొర్రెల, మేకల పంపిణీదారుల సంఘం శ్రేణులు ఉప తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్‌పేట మల్లేశ్ ఆధ్వర్యంలో సంఘం శ్రేణులు వినతిపత్రం అందజేశారు. నాయకులు రమేష్, మల్లేష్, మైసయ్య, సత్యనారాయణ, మహేందర్ యాదవ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ అనురాధ అన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ అంబర్‌సింగ్‌తో కలిసి వారు ప్రారంభించారు. 179 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిర, డాక్టర్లు పరీక్షిత్ నరేందర్, మంజులాదేవి, తిరుపతిరెడ్డి, స్థానిక నాయకులు మల్లేశ్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారుగా 500 మంది నిరుపేదల ఇండ్లను ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన సత్తయ్య ఇంటి నిర్మాణం కోసం ట్రస్టు సభ్యులు సిమెంట్, స్టీల్, ఇసుక, ఇటుక, తదితర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు సర్పంచ్ పయ్యావుల రమేష్‌యాదవ్, ఎంపిటిసి సునీత, సుదర్శన్‌రెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆ కంపెనీని మూసేయాల్సిందే

బొక్కల పరిశ్రమ ఎదుట కొనసాగుతున్న నిరాహార దీక్ష



కంపెనీ ఎదుట దీక్ష చేపట్టిన గ్రామస్తులు

యాచారం: కొత్తపల్లి–తక్కళ్లపల్లి గ్రామాల మధ్యన ఏర్పాటు చేసిన ఆగ్రోఫీడ్ (బొక్కల) కంపెనీని మూసేసే వరకు కంపెనీ ఎదుట నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు, కొత్తపల్లి ఉప సర్పంచ్ కావలి జగన్ అన్నారు. రెండోరోజు శుక్రవారం కూడా కంపెనీ ఎదుట నిరాహార దీక్ష కొనసాగింది. ఆగ్రోఫీడ్ కంపెనీ పేరుతో వ్యాపారులు దూరప్రాంతాల నుంచి పశుమాంస బొక్కలను తెచ్చి నూనెను తయారుచేయడం వల్ల తీవ్ర దుర్వాసన వస్తుందని అన్నారు. దుర్వాసనతో కొత్తపల్లి, తక్కళ్లపల్లి, మాల్, తమ్మలోనిగూడ గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులకు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని అన్నారు. గత ఐదేళ్లుగా బీఆర్ఎస్‌లోని మంత్రులకు, జిల్లా కలెక్టర్లకు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని అన్నారు. అందుకే నిరాహార దీక్షకు పూనుకున్నామని అన్నారు. దీక్షాపరులకు మద్దతుగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, దండెం రాంరెడ్డి, దెంది రాంరెడ్డి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల సర్పంచ్‌లు ఎండీ. హబీబుద్దీన్, సంతోష మద్దతు తెలిపారు. అధికారులు తక్షణమే కంపెనీని మూసేసి మా ప్రాణాలు కాపాడకపోతే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. గుండాలు, జగన్, రవీందర్‌రెడ్డి, జంగయ్య తదితరులు ఉన్నారు.

'నిరంతర విద్యుత్' సరఫరా చేయాలి

బీజేపీ నేత బాలకృష్ణ

తలకొండపల్లి: వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నామంటున్న ప్రభుత్వం.. వాస్తవానికి కేవలం 5 నుంచి 7 గంటలు మాత్రమే విద్యుత్‌ను సరఫరా చేస్తోందని ఆరోపించారు. విద్యుత్ కోతలతో రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే విత్తనదశలో ఉన్న శనగపంట దెబ్బతింటుందని, మొక్కజొన్న, జొన్న పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. కరెంట్ కోతలతో వ్యవసాయ బోర్ల నుంచి పంటలకు సకాలంలో నీరందటంలేదన్నారు. వెంటనే రైతులకు 24 గంటల పాటు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వండి



ఇబ్రహీంపట్నం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన నేతలు



ఆమనగల్లు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ప్రజా, కార్మిక సంఘాల నేతల ధర్నా

ఇబ్రహీంపట్నం: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, స్థలముంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ సామేల్ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో వేలాది మందికి సొంత ఇల్లులేక సుమారు 25 సంవత్సరాలుగా కిరాయి ఇళ్లలో నివసిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అద్దె ఇళ్లకు కిరాయి కట్టలేక ఎంతోమంది పేదలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ఎన్నికల హామీలో భాగంగా అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వినోబానగర్‌లోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, మండల కన్వీనర్ బుగ్గరాములు, మున్సిపల్ కన్వీనర్ ఎల్లేష్, రైతు సంఘం మండల కార్యదర్శి ముసలయ్య, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ, యాచారం మండల అధ్యక్షురాలు అరుణ, ఉమా, మత్స్యకారిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌తోపాటు కిషన్, పద్మ, యాదమ్మ, లలిత పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడాలి

మంచాల: గ్రామాల్లో అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మంచాల తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా నిరుపేదలకు ఇళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే గ్రామాల్లో అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం సుందర్, రావుల జంగయ్య, ఎస్.రాజు, జంగయ్య, బుచ్చయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఇల్లూ ఇవ్వలేదు

ఆమనగల్లు: అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయలేదన్నారు. ఇంటిస్థలం ఉన్న నిరుపేదలకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కురుమయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, సీఐటీయూ మండల కన్వీనర్ లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేదలకు స్థలం కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు, నర్సింహ, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ, మండల కమిటీ సభ్యులు శివ, శ్రీశైలం,మల్లయ్య, సర్వర్ అనిత, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.